క్లుప్తంగా

స్థల పరిశీలన



స్థలాన్ని చదును చేస్తున్న కూలీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లి వెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలోని న్యూట్రిషన్ కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు ఎంఈఓ–2 మునిసుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయురాలు వాణి శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. కిచెన్ గార్డెన్‌లో వేసిన గోంగూర, చిరాకు, తరుగాకు, తోటాకు, మెంతాకు, బెండ, చిక్కుడు, సొర, బీరకాయలు, ముల్లంగి వంటి కూరగాయల పంటలను సాగు చేయాలని తెలిపారు. పాఠశాల ఆవరణలో కూరగాయలను సాగు చేయడం వల్ల విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం వాటిని వాడుకోవచ్చని ఆయన తెలిపారు. కూరగాయల సాగుపై వంట నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ముఖ్యం



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యాపకులు

శ్రీకాళహస్తి: ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కలిగి ఉండటం ముఖ్యమని ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజ నాయుడు అన్నారు. శుక్రవారం కళాశాలలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగం వల్ల క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉందన్నారు. ప్లాస్టిక్ వాడకానికి స్వస్తి పలికాలని కోరారు. కళాశాల ఐక్యూ కో–ఆర్డినేటర్ బాపనయ్య మాట్లాడుతూ, ప్లాస్టిక్ వాడకం ఎక్కువగా ఉందని, వీలైనంత వరకు దీని వాడకానికి దూరంగా ఉండాలన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలు, ప్లాస్టిక్ రీసైక్లింగ్..ఇత్యాది అంశాలపై విద్యార్థులకు ప్రోగ్రాం రిసోర్స్ పర్సన్ డాక్టర్ నరసింహావర్మ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సునీత, సుధీర్ పాల్గొన్నారు.

శ్మశానంలో ముళ్లపొదలు తొలగింపు



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామంలోని శ్మశానంలోని ముళ్లపొదలను శుక్రవారం గ్రామ సర్పంచ్ జొన్నల రమణమ్మ, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి జొన్నలగోపాల్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి జలజశ్రీ తెలిపారు. శ్మశానంలో ముళ్లపొదలు ఉండడంతో శవాలను పూడ్చడానికి, దహనం చేయడానికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతుండడంతో స్పందించిన సర్పంచ్ రమణమ్మ జేసీబీ యంత్రం, కూలీలతో ముళ్లపొదలను తొలగించి శుభ్రం చేశారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

చుక్కలు నిడుగల్లో టీడీపీకి చుక్కెదురు

శ్రీకాళహస్తి: మండలంలోని చుక్కలు నిడిగల్లులో పర్యటించిన టీడీపీ నాయకులకు చుక్కెదురైంది. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం పేరిట శుక్రవారం ఇక్కడ పర్యటించారు. అయితే గ్రామస్తులు గతంలో ఉపాధి పనుల్లో భాగంగా టీవీ కండ్రిక వాసులు రోడ్డును తవ్విన సమయంలో తమకు టీడీపీ నాయకులు మద్దతు ఇవ్వలేదనే ఉద్దేశంతో గ్రామంలో ఎవరూ టీడీపీ నాయకులతో కలిసి తిరగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ గ్రామంలో లబ్ధి పొందుతున్న ఓ నాయకుడు మాత్రం వారితో తిరిగాడు.

సీపీఐ పట్టణ కార్యదర్శిగా గోపి

శ్రీకాళహస్తి: సీపీఐ పట్టణ కార్యదర్శిగా రొద్ద గోపి శుక్రవారం ఎంపికయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పదవి అప్పజెప్పిన పార్టీకి, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలో పేద, మధ్యతరగతి, కార్మిక, కర్షక, ఉద్యోగ సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి

తిరుపతి అర్బన్: పొదుపు సంఘాలను బలోపేతానికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకుని గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు అన్నారు. శుక్రవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో పొదుపు సంఘాల లీడర్లు, సీసీలు, ఏపీఎంలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. గ్రామాలలోని అత్యంత నిరుపేదల అవసరాలు, మహిళల జీవనోపాధుల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీడీ ప్రభావతి, డీపీఎం తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో అరాచక పాలన

- ఊర్లు వదలిన కార్యకర్తలు
- 200కు పైగా అక్రమ కేసులు
- వెయ్యికిపైగా ఇళ్లు, పునాదులు ధ్వంసం
- ఫ్లెక్సీలు కడితే ఓర్వలేనితనంతో తొలగింపు
- మీరు రెడ్‌బుక్‌లో రాసుకున్నారు.. మేము బ్లడ్‌తో రాసుకుంటాం
- మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో ఏడాదిగా అరాచక పాలన సాగుతోందని, కక్ష పూరిత రాజకీయాలతో నిత్యం తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కేసులు బనాయించడం, దాడులు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం స్థానిక మధు కన్వెన్షన్ హాల్‌లో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా హామీలను నెరవేర్చకపోవడంతో అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. గిట్టుబాటు ధర లేక ఐదెకరాల పొలం ఉండే రైతు రూ.లక్ష చొప్పున ఐదేళ్లలో రూ.5లక్షలు నష్టపోతున్నారన్నారు. మహిళలు, విద్యార్థులు, యువతను కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. శ్రీకాళహస్తిలో ఆర్చి నుంచి గుడి వరకు ఎక్కడా ఖాళీ లేకుండా కూటమి నాయకులు ఫ్లెక్సీల మయం చేశారని, తాము తమ నాయకులకు స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే మాత్రం పురపాలక సంఘ అధికారులను వాటిని తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపేడులో 40మంది ఎస్టీలు, తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగలో 20 ఇళ్లు ఊర్లు వదలి వలసపోయారని ఇలాంటి అరాచక పాలన తాము చేయలేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వెయ్యికి పైగా ఇళ్లు, పునాదులు ధ్వంసం చేశారని, గతంలో శ్రీకాళహస్తిలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా ప్రస్తుత ఎమ్మెల్యే అరాచకాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. గతంలో తన వద్దకు వచ్చిన శత్రువుకు కూడా సాయం చేశానని, ఇప్పుడు దీనికి భిన్నంగా కక్ష సాధింపు రాజకీయాలు చేయడం హేయమని నిరసించారు. 'రెడ్‌బుక్' అంటూ రాసుకుని కక్ష సాధిస్తున్నారని, కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను తాము బ్లడ్‌బుక్ రాసుకుంటున్నామన్నారు. జనసేన నేత వినుత తనపై ఎన్నో విమర్శలు చేసిందని, అయితే ఆమె ఇప్పుడు తన వద్ద పనిచేసే వ్యక్తినే దారుణంగా చంపి ఆంధ్ర, తమిళనాడు ప్రాంతం సర్వీసుగా మారిందని ఆ కేసును ఉదహరించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ తనను అరే.. ఒరే అంటూ జైలుకు పంపుతానంటూ నోరు పారేసుకోవడం చూస్తుంటే అతడి దిగజారుడు నైజమేమిటో ఇట్టే తెలుస్తోందని, అతడి పాపాలు త్వరలోనే పండుతాయన్నారు. టీడీపీ దాడులు, దౌష్ట్యకాలు, కేసులకు భయపడేది లేదని, ఎవరికి ఏ కష్టమొచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాలుగు మండలాల అధ్యక్షులు, శ్రీకాళహస్తీశ్వరలయ పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, గిరిధర్‌రెడ్డి, వయ్యాల కృష్ణారెడ్డి, ఉన్నం వాసుదేవనాయుడు, కోగిలి సుబ్రహ్మణ్యం, మధుసూదన్‌రెడ్డి, రమణయ్యయాదవ్, సుధాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, చంద్రయ్యనాయుడు, హరిప్రసాద్‌రెడ్డి, సిరాజ్‌బాషా, పఠాన్ ఫరీద్, శ్రీవారిసురేష్, కంఠా ఉదయ్, గోరా, ఉన్నం నిర్మల, పసల కృష్ణయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, తొట్టంబేడు, రేణిగుంట ఎంపీపీలు నిర్మలమ్మ, అత్తూరు హరిప్రసాద్ రెడ్డి, ఏర్పేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాల కన్వీనర్లు గున్నేరి కిషోర్ రెడ్డి, చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి, కోగిల సుబ్రహ్మణ్యం, కూనాటి రమణయ్య యాదవ్, గంగారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రేణిగుంట: తూకివాకం సమీపంలో పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై శుక్రవారం ఎదురెదురుగా వస్తున్న టెంపో ట్రావెల్ వాహనం, లగేజి ఆటో ఢీకొనడంతో లగేజి ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో తిరుపతి రుయా హాస్పిటకు తరలించారు. గాజులమండ్యం పోలీసులు కేసు నమోదు చేశారు.

నోటీస్ బోర్డు

నారాయణవనం: ఎంపీపీ దివాకర్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అరుణ తెలిపారు.

నేటి నుంచి నీరాటోత్సవాలు

నారాయణవనం: టీటీడీ అనుబంధ పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నుంచి 28వ తేదీ వరకు ఆండాళ్ నీరాటోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్యులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో పాడి ఆవు మృతి

వరదయ్యపాళెం: విద్యుత్ షాక్‌కు గురై ఓ పాడి ఆవు మృతి చెందిన ఘటన మండలపరిధిలో చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. సాధనవారిపాళెం గ్రామానికి చెందిన ప్రతాప్ అనే పాడి రైతుకు చెందిన ఆవు మేత కోసం శుక్రవారం పొలాల్లోకి వెళ్లింది. అయితే అతి తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న తీగలు తగిలి విద్యుత్ షాక్‌కు గురై ఆవు మృతి చెందింది. గతంలో కూడా అదే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పలు పశువులు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు స్థానిక రైతులు వాపోతున్నారు. ఈ విషయమై పలు మార్లు విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. వరుసగా పశువులు మృతి చెంది ఆర్థికంగా నష్టపోయామని, ఇదంతా విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే జరిగిందని ఆరోపిస్తున్నారు. అందుకు ఆ శాఖ అధికారులే బాధ్యత వహించాలని రైతులు చెబుతున్నారు.

చంద్రబాబు మోసాలను ఎండగడదాం

- సత్యవేడు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్



రీకాలింగ్ బాబూస్ మేనిఫెస్టో పోస్టర్లను విడుదల చేస్తున్న నూకతోటి రాజేష్, నాయకులు

నారాయణవనం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన 13 నెలల కాలంలో చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించేందుకే రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. శుక్రవారం స్థానిక దూండి వినాయకస్వామి కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సొరకాయలు అధ్యక్షతన జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ.. రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో సమావేశానికి రాజేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పోస్టర్లను, ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం క్యూఆర్ కోడ్ ప్యాడ్లను ఆవిష్కరించారు. రాజేష్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో మనకు ఓటేసిన 40 శాతం ప్రజల తరఫున పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జగన్ కంటే ఎక్కువ సంక్షేమ పథకాలను అందిస్తామని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రజలను నమ్మబలికి మోసం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి మోసాలను ఎండగడుతూ ప్రజల ముందుకు పార్టీ శ్రేణులు వెళ్లాలని అన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు షెడ్యూల్ మేరకు ప్రతి రోజు పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాలను సందర్శించి బాబు మోసాలపై అభిప్రాయ సేకరణ చేపట్టాలని సూచించారు. పార్టీ కోసం పని చేసే కార్యకర్తలు జగనన్న మైండ్‌లోని గుడ్‌బుక్‌లో స్థానం పొందుతారని.. పార్టీ శ్రేణులకు మంచి రోజులు ముందు ఉందన్నారు.

జగనన్న పథకాలను మరువలేరు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా జగనన్న అమలు చేసిన పథకాలను ప్రజలు మరచిపోలేక పోతున్నారని అన్నారు. అమ్మ ఒడి నగదు వచ్చిందంటూ చిన్నారి సీఎం చంద్రబాబు చెప్పిందంటే జగనన్న పథకాలు ఏ మేరకు ప్రజలకు చేరువైందో అర్థమవుతోందని అన్నారు. కులమతాలు, పార్టీలు చూడకుండా అందరికీ అమలైందని రాజేష్ గుర్తు చేశారు. ఒక్క మద్యపాన నిషేధం తప్ప అన్ని హామీలను జగనన్న ఆరు నెలలకే అమలు చేశారని గుర్తు చేశారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో ఎన్ని అమలు చేసిందన్నారు. మోసాలతో ఎంతో కాలం పాలన సాగదని రాజేష్ అన్నారు.

రాష్ట్రం.. రావణకాష్టం..

కూటమి పాలనలో రాష్ట్రంలో రావణ పాలన ఏలుతోందని రాజేష్ ఆరోపించారు. శాంతిభద్రతలు, మహిళలకు రక్షణ పూర్తిగా కరువైందన్నారు. కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి, మాజీమంత్రి రోజాపై నగరి ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలను అందరూ గమనిస్తున్నారని అన్నారు. ఫిర్యాదులపై స్పందించకుండా పోలీస్ వ్యవస్థ ఏకపక్షంగా వ్యవహరించడం శోచనీయమని అన్నారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రసన్నకుమార్ రెడ్డిపై దౌర్జన్యానికి పాల్పడితే ఆయనపైనే కేసు నమోదు చేయడమేనా రెడ్‌బుక్ పాలన అంటూ ప్రశ్నించారు. ఏమి చేసినా చెల్లుతుందని కూటమి నాయకులు అనుకోవడం పొరబాటన్నారు. డైలాగ్‌లు సినిమాలోనే బాగుంటాయని చెప్పిన పవన్ కల్యాణ్ ఆనాడు కారు టాప్‌పై కూర్చుని సినిమా డైలాగులను చెప్పే తప్పు లేనిది ఈ రోజు రప్ప రప్ప అంటే మాత్రం తప్పుగా కనిపించిందా ? బహిరంగ మీటింగ్‌లో చెప్పు చూపించడం ఆయనకు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. అన్నింటికీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రెడీగా ఉందన్నారు. సమావేశంలో ఎంపీపీ దివాకర్ రెడ్డి, ముఖ్యనాయకులు భానుప్రకాష్‌రెడ్డి, అన్నాదురై, కిరణ్, రవి, సుబ్రహ్మణ్యం, రాజారెడ్డి, పళని రెడ్డి, వైస్ ఎంపీపీ శివశంకర్, ఎంపీటీసీలు పొన్నుస్వామి, రవి, సర్పంచ్‌లు సాయిరవి, సుబ్రమణ్యం రెడ్డి, నాగూరు, నాయకులు గురుస్వామి, శంకరయ్య, హేమచంద్రారెడ్డి, బాలాజిరెడ్డి, తిరువెంగడం, పీజీ బాబు, చీరాలయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

బుచ్చినాయుడుకండ్రిగ: ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ బుచ్చినాయుడుకండ్రిగలోని పార్టీ కార్యాలయం వద్ద శనివారం మధ్యాహ్నం 3 గంటలకు మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల కమిటీ సభ్యుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్ సీపీ కన్వీనరు కొణతనేని మణినాయుడు తెలిపారు. సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు.

సత్యవేడులో..

సత్యవేడు: ఎన్నికల నాటి కూటమి ప్రభుత్వ మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' ఆత్మీయ సమావేశానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలు హాజరు కావాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుశీల్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఉదయం 10 గంటలకు సత్యవేడులోని బేరిశెట్ట కల్యాణ మండపంలో సత్యవేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని ఆయన చెప్పారు.

రావణ బ్రహ్మపై కుమారస్వామి విహారం



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు



హంసవాహనంపై..

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి అమ్మవార్లు రావణ బ్రహ్మ వాహనంపై పురవీధుల్లో విహరించారు. మొదట ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి పూజలు చేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమస్వామి అమ్మవార్లు రావణ బ్రహ్మ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత ఉదయం హంసవాహనంపై విహరించారు. ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

జీఓ 36ను తక్షణమే అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

శ్రీకాళహస్తి: జీఓ నంబర్ 36ను తక్షణమే అమలు చేసి మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా నాయకులు మునిరాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 12వ తేదీ నుంచి సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులకు మద్దతుగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటగిరీల నిర్ణయంలో జరిగిన పొరపాట్లను జీఓ ఎంఎస్ నెం.11 ద్వారా సరిదిద్దాలని కోరారు. షరతులు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులకు అమలు చేయాలన్నారు. సమ్మెకాలపు ఒప్పందాల్లో భాగంగా రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియో పెంచాలన్నారు. వయోపరిమితి 62 ఏళ్లకు పెంపు, గ్రాట్యూటీ చెల్లించాలని చెప్పారు. ఎస్‌ఎంఆర్, బదిలీ, కోవిడ్, క్లాప్ డ్రైవర్లకు జీఓ 36 ప్రకారం జీతాలు చెల్లించాలని కోరారు. చట్టబద్ధమైన సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య, జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, గంధం మణి, వెంకటేష్, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

రుణాల టార్గెట్ రూ.10కోట్లు

సత్యవేడు: మండలానికి 2025–26 ఆర్థిక సంవత్సరానికి స్త్రీనిధి రుణాల టార్గెట్ రూ.10.76 కోట్లు అని క్లస్టర్ ఇన్‌చార్జ్ మేనేజర్ ఆదిల్‌బాష తెలిపారు. మండల పరిధిలోని 1076 మంది డ్వాక్రా సభ్యులకు స్త్రీనిధి రుణాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇప్పటికి 686 మందికి రూ.5.9 కోట్లు శ్రీనిధి రుణాలు ఇప్పటికే ఇచ్చినట్లు తెలిపారు. స్త్రీనిధి రుణాలకు 95 పైసలు వడ్డీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. రుణం రూ.50 వేలుకు రూ.400, రూ.లక్షకు రూ.1200 చెల్లించాల్సి ఉంటుందన్నారు. స్త్రీనిధి రుణాల కోసం మహిళా సంఘాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న 48 గంటల్లో బ్యాంకులో నగదు జమ అవుతుందన్నారు.

21న చలో విజయవాడ

శ్రీకాళహస్తి: ఏఐటీయూసీ అనుబంధ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ చలో విజయవాడను విజయవంతం చేయాలని ఎనర్జీ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు బొజ్జ మునిహరికృష్ణ అన్నారు. శుక్రవారం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఏపీఎస్‌ఈబీ పాత సర్వీసు రూల్స్ వర్తింపజేసి అందరికీ ఏఎల్‌ఎం ప్రమోషన్ ఇవ్వాలన్నారు. ఈపీడీసీఎల్ చీపురుపల్లి ఆర్‌ఈసీఎస్ పరిధిలో పనిచేస్తున్న జేఎల్‌ఎం గ్రేడ్–2లకు వెంటనే ప్రమోషన్ ప్రకటించి పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూలై 21న రామవరప్పాడు రింగు రోడ్డు నుంచి విద్యుత్ సౌధ వరకు ర్యాలీ చేస్తామన్నారు. పవన్, పాండు, విజయ్, సోము, మహేష్, జనమాల గురవయ్య, శ్రీధర్, చందు, ప్రజానాట్యమండలి నాయకుడు గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనలో ఎంజీఎం విద్యార్థిని ప్రతిభ

శ్రీకాళహస్తి: క్లాసికల్ నృత్య ప్రదర్శనలో పట్టణంలోని ఎంజీఎం విద్యార్థిని హనుశ్రీ ధ్వనిత ప్రతిభ చాటింది. నెల్లూరులో జరిగిన శ్రీకృష్ణ కల్చరల్ అండ్ ఈవెంట్ నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎంజీఎం స్కూల్ విద్యార్థిని ఏ.హను శ్రీ ధన్విత సెకండ్ క్లాస్ క్లాసికల్ నృత్య ప్రదర్శనలో రాణించి ప్రతిభా పురస్కారం, జ్ఞాపిక, సర్టిఫికెట్ అందుకుంది. శుక్రవారం ఎంజీఎం గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్ హనుశ్రీ ధన్వితని అభినందించారు. మన సంస్కృతిని చాటిచెప్పేలా నృత్య ప్రదర్శనలు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. హెడ్మాస్టర్ మునిరత్నం నాయుడు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ వెంకటరత్నమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ తెలిపారు. శుక్రవారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పర్యావరణానికి కలిగే ముప్పుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్ వ్యర్థాలను అశాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహణ చేయడం వల్ల పర్యావరణానికి అనేక నష్టాలను కలిగించడమే కాకుండా జల, భూకాలుష్యం జరుగుతుందన్నారు. సెల్‌ఫోన్లు పాడైపోయిన తర్వాత పడేయడం వల్ల వాటి బ్యాటరీలు విచ్ఛిన్నం అవుతున్నాయని తెలిపారు. అవి పర్యావరణంలో, నేలలో కలిసి జీవరాశులకు హాని చేస్తున్నాయన్నారు. ఈ దుష్పరిణామాలను అడ్డుకోవాలంటే పౌరులు ఈ వ్యర్థాల నిర్వహణ గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. స్వచ్ఛతతోనే వ్యాధులు దూరమవుతాయని తెలిపారు. మొక్కలను నాటడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. హెచ్‌ఎం రమణయ్య, గ్రామ కార్యదర్శి చిరంజీవి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం సమర్పిస్తున్న డీకే పాళ్యం వాసులు

నారాయణవనం: మండలంలో డీకే పాళ్యం పంచాయతీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్ గ్రామస్తులతో కలిసి ఎంపీడీఓ అరుణకు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంచాయతీలో పైపులైన్లు పాడవడంతో ఓవర్‌హెడ్ ట్యాంక్ ద్వారా రక్షిత తాగునీరు వృథాగా పోతోందన్నారు. దీంతో ఎత్తైన ప్రాంతంలోని ఇళ్లకు నీరు అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పైపులైన్లకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనికితోడు గ్రామంలోని మూడు చేతిపంపులు మరమ్మతులకు నోచుకోలేక నిరుపయోగంగా ఉన్నాయని, పలుమార్లు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని వాపోయారు. ఈమేరకు వారు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీఓకు వినతిపత్రం సమర్పించారు. ఎంపీడీఓ అరుణ స్పందిస్తూ పంచాయతీలో తాగునీటి సమస్యపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని ఆదేశించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో గ్రామస్తులు మధు కుమార్, వంశీ ,ధనసింగ్, నవీన్, లారెన్స్, ధనుష్, జీవా తదితరులు ఉన్నారు.

పీ4 సర్వేతో పేదలకు ఆర్థికంగా మేలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరత్నమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: పీ4 సర్వేతో పేదలకు ఆర్థికంగా మేలు జరుగుతుందని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె, తహసీల్దారు శ్రీదేవి, ఎస్‌ఐ విశ్వనాథనాయుడు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో పీ4 సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు శ్రీదేవి మాట్లాడుతూ పీ4 సర్వే ద్వారా అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను గుర్తించి, వారి ఆర్థిక స్థితిని మెరుగుపరచి, పేదరిక నిర్మూలనే ధ్యేయమన్నారు. పీ4 సర్వేలో ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో పేదరికం నిర్మూలన కోసం చేపట్టిన కార్యక్రమం అని, ఈ సర్వేలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, ఆర్థిక సహాయం, సామాజిక సేవలపై దృష్టి పెట్టడం ద్వారా లబ్ధి చేకూరుతుందని తెలిపారు. మండలంలో పీ4 కార్యక్రమం విజయవంతం అయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటేశులు, ఏఓ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోండి



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

నారాయణవనం: పిచ్చాటూరులో ఈనెల 23న బుధవారం నిర్వహించే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకుని యువత ఉద్యోగాలను పొందాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో జాబ్‌మేళా పోస్టర్లను విడుదల చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి పిచ్చాటూరు ఎంకేటీ మహల్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈఎంసీ క్లస్టర్, శ్రీసిటీ, తిరుపతి, చెన్నైలోని 15 బహుళ జాతీయ కంపెనీల్లో 500 పైగా ఉద్యో గాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ, ఐటీఐ, డిప్లొమో చదువుకున్న యువత జాబ్‌మేళాలో పాల్గొనాలనవచ్చన్నారు. ఎంపీడీఓ అరుణ మాట్లాడుతూ జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు విధిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈనెల 22వ తేదీలోపు http://naipunyam.ap.gov.in/ user-regisrtration రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 9440374535, 9908243736, 9988853335 నంబర్లను సంప్రదించాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు సుమన్ కుమార్, నెట్ క్యాప్ మాజీ చైర్మన్ ఏకాంబరం, మాజీ ఎంపీపీలు భక్తవత్సలం పాల్గొన్నారు.